నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 7 మార్చి 2025 | MEDAK

పుల్కల్ మండలం గంగోజిపేటలో బోరు వేయిస్తున్న దృశ్యం


సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో బోరు నుంచి తక్కువగా వస్తున్న నీరు


వ్యవసాయానికి నీరందక పుల్కల్ మండలంలోని ఓ గ్రామంలో బోరు తవ్విస్తున్న రైతు

బోరుమంటున్న పల్లెలు

ఎండుతున్న పంటలు.. నెర్రెలు బారిన పొలాలు


చౌటకూర్ మండలం తాడిదన్‌పల్లిలో ఎండిపోయిన వరిపంట

కొండపాక మండలం దమ్మక్కపేటలో ఎండిన వరిపైరును చూపిస్తున్న రైతులు


సంగారెడ్డి ఫసల్వాదిలో కాలిన బోరుమోటరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రామాయంపేట రూరల్: తొనిగండ్లలో నీరందక ఎండిన వరిపొలం

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం రసూలాబాద్ చెరువులో అడుగంటిన జలాలు

- వేధిస్తున్న విద్యుత్ సమస్యలు
- కాలిపోతున్న బోరుమోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు
- బోర్లు వేయించడం, బావులు పూడిక తీయిస్తున్న రైతులు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడులు
- కష్టాలనే మిగిల్చిన యాసంగి సాగు

పల్లెల్లో మళ్లీ పాత రోజులు వచ్చాయి. సమైక్య పాలన నాటి పరిస్థితులు కండ్ల ముందు కనిపిస్తున్నాయి. మార్పు అంటూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెలు, పట్టణాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ప్రధానంగా రైతులకు సర్కారు నుంచి చేయూత లభించక పోవడంతో అరిగోస పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో ఎవుసం చేయడం రైతులకు సవాలుగా మారింది. బీఆర్ఎస్ పాలనలో పుష్కలంగా సాగునీరు, నాణ్యమైన ఉచిత కరెంట్ సరఫరా, సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం, రైతు బంధు, రైతుబీమా సౌకర్యం కల్పించడం, గ్రామాల్లోనే మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనడంతో రైతులు ధీమాగా పంటలు పండించారు. ప్రస్తుతం అన్నదాతలకు ఆ పరిస్థితి లేదు. ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మండుటెండల్లో హల్దీ, కూడవెల్లి వాగుల్లో గోదావరి జలాలను పారించింది. రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్ జలాశయాలను గోదావరి జలాలతో నింపి, వాటి ద్వారా అనేక చెరువులు, చెక్‌డ్యామ్‌లకు జలాలను తరలించింది. సింగూరు జలాలను మెతుకు సీమ రైతుల అవసరాలకే కేటాయించింది. వేసవికి ముందే రిజర్వాయర్లు నుంచి చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, హల్దీ, కూడవెల్లి వాగులను నింపడంతో నీటికి ఇబ్బంది ఎదురుకాలేదు. భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల కింద మంచిగా పంటలు పండినయి. దీంతో గుంట జాగా లేకుండా సాగులోకి వచ్చింది. ప్రస్తుతం కరెంట్ కోతలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మాటిమాటికి కరెంట్ ట్రిప్ అవుతుండడం, భూగర్భ జలాలు అడుగంటి బోరుమోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పెరిగి కాలిపోతున్నాయి. త్రీఫేజ్ కరెంట్ కూడా ఇష్టం వచ్చినట్లు వస్తుండడంతో పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రైతులు బోర్లు వేయిస్తున్నారు. ఏ ఊరిలో చూసినా రైతులు బోర్లు తవ్వించే పనుల్లోనే నిమగ్నమయ్యారు. 700 ఫీట్లు వేసినా కొన్ని ప్రాంతాల్లో నీరు రావడం లేదు. సిద్దిపేట జిల్లాలో క్రేన్లతో రైతులు బావుల్లో పూడిక తీయిస్తున్నారు. బోరు మెకానిక్ షాప్‌లకు గిరాకీ పెరిగింది. మళ్లీ పాత రోజులు వచ్చాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్పు అంటే గిదేనా అని ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్, ఉమ్మడి మెదక్ జిల్లా, మార్చి 6


సంగారెడ్డి జిల్లా ఫసల్వాదిలో నీరు అందక ఎండిపోయిన టమాట పంట

సిద్దిపేట జిల్లా కొండపాక మండలం పిట్టలవాడ శివారులో డీ-4 కాలువ దుస్థితి

చాలా ఇబ్బందిగ ఉంది..

బోరుల్లో నీళ్లు అడుగంటడంతో ఇబ్బందులు పడుతున్నాం. పంట ఎండిపోతుండడంతో బాధగా ఉన్నది. ఈసారి నీళ్లకు చానా ఇబ్బంది అవుతున్నది. గత ప్రభుత్వం మాదిరిగా ప్రాజెక్టుల ద్వారా కాలువలకు నీళ్లు వదిలితే బోర్లలో మంచి నీళ్లు వస్తుండే. పంటలు ఎండిపోయిన రైతులకు సర్కారు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– కుమ్మరి మల్లయ్య, రైతు, తొనిగండ్ల, మెదక్ జిల్లా

కాలువలు నిర్మించి నీళ్లివ్వాలి..

భూగర్భ జలాలు అడుగంటడంతో పొలానికి సరిగ్గా నీరు అందడం లేదు. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా పొలం వద్దనే ఉంటూ పారకం పెడుతున్న. దీంతో బోరు మోటర్లపైన భారం పడుతున్నది. మోటర్లు కాలిపోతున్నయి. మా చుట్టుపక్కల గ్రామాల రైతులకు కాలువల ద్వారా నీరు వచ్చింది. ఇప్పటికి అదే మార్గం ఉంది. కానీ, మాకు ఆ అదృష్టం లేకుండా పోయింది. ప్రభుత్వం కాలువల మీద దృష్టి పెడితే బాగుంటుంది.

– మంగళి అంజయ్య, రైతు, తొనిగండ్ల, మెదక్ జిల్లా

హుస్నాబాద్‌లో ఎండిపోయిన యాదగిరికి చెందిన వరిపంట

ఆవిరైన చివరి ఆశలు

హుస్నాబాద్ టౌన్, మార్చి 6: చి'వరి' ఆశలు ఆవిరైపోతున్నాయి. ఇరవై రోజులుగా బాయిల నీళ్లు ఎల్లుతలేవు. వేసిన ఎకరంన్నర వరిల ఇరవై గుంటలకుపైగా ఎండిపోయింది. ఇగ ఎకరం ఉన్నా.. ఆది కూడా వరుస తడులు పారినయ్. వాటి కూడా నీళ్లు అందుతలేవు. ఎందుకో ఎనిమిది ఏండ్ల నుంచి ఎన్నడూ గిట్ల కాలేదు. పోయిన ఏడు బాయిల పూడిక తీయించిన, సైడ్‌కూడా ఏసిన. అయినా వరి పారతలేదు. ఎండిపోయింది... ఏం చేయాలో తెల్వక బర్లకు వరి కోసుకపోమన్న. ఇదీ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులోని రైతు పినికాశి యాదగిరికి చెందిన ఎవుసం గోస.

నలభై వేల అప్పుతెచ్చిన...

బాయిల నీళ్లు మంచిగనే ఎల్లుతున్నయని మక్క ఎయ్యకుండ వరి ఏసిన. మంచిగనే పంట వత్తదని ఆశ ఉండే. అందుకనే మిత్తికి నలభై వేల రూపాయలు తెచ్చి ఎవుసానికి పెట్టుబడి పెట్టిన. లచ్చ రూపాయల దాక పంట పండుతదని శాన ఆశ ఉండే. వరి అంత పొట్టకు వచ్చి ఈనుతాంది గంతే నీళ్లు ఎల్లుడు బంద్ అయినయి. ఏం జెయ్యాలే గంట కూడా నీళ్లు ఎల్లుతలేవు. ఎప్పుడు బైరోని చెరువు ఊట మంచిగుండే మాకు మరి. ఎందుకో ఆ ఊట కూడ ఇప్పుడు కనబడతలేదు. ఈ నీల్లతో వరి ఎట్ల పారిచ్చుడో అర్థం అవుతలేదు. ఎండలు కూడ బాగా కొడుతున్నయి. చేసిన అప్పులు కట్టలేక ఇంత ఆడ ఈడ మేస్త్రీ పనులకు పోతున్న. లేకుంటే ఇల్లు ఎల్లటట్టులేదు. కాలం గిట్లేందుకు సేసిందో... మేము ఎట్ల బతుకుడో అర్థమవులేదు. – పినికాశి యాదగిరి,రైతు, హుస్నాబాద్

అటకెక్కిన ఈ-పాలన!

జీపీల్లో నిరుపయోగంగా టీ-ఫైబర్ సేవలు

- పరికరాలు ఉన్నా.. ఇంటర్నెట్ సౌకర్యం సున్నా..
- డిజిటల్ సేవలు అందక గ్రామీణుల ఇబ్బందులు
- ప్రతి పనికి మండల కేంద్రాలకు జనం పరుగులు
- బీఆర్ఎస్ ప్రభుత్వ ఆశయాలకు తిలోదకాలు



మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న టీ-ఫైబర్ పరికరాలు

మెదక్, మార్చి 6(నమస్తే తెలంగాణ): ప్రతి గ్రామ పంచాయతీలో ఈ-పాలన అందుబాటులోకి తేవడం, ఇంటింటికీ తక్కువ ధరకే ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం టీ-ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టింది. మారుతున్న టెక్నాలజీకి అనుకూలంగా ఇంటర్నెట్ సేవలు గ్రామీణులకు అందించాలనే మంచి ఆలోచనతో అప్పటి ప్రభుత్వం దీనిని రూపొందించింది. ఈ సేవలు ప్రారంభానికి నోచుకోకుండానే మూలకు చేరాయి. గ్రామ పంచాయతీల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి సేవలు అందుబాటులోకి తెస్తే గ్రామీణ ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన బాధలు తప్పుతాయి. ఇప్పుడు చిన్న చిన్న పనులకు మండల కేంద్రాలకు వెళ్తున్నారు. సేవలు పొందేందుకు ఒక్కోసారి రోజుల తరబడి తిరగాల్సి వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లో టీ-ఫైబర్ సేవలు అందించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. మెదక్ జిల్లా కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టరేట్‌లోని ఆయా శాఖల్లో ఈ-ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి శాఖలో ఈ-ఆఫీస్ విధానం విజయవంతంగా అమలవుతున్నది. కలెక్టర్ దృష్టిసారించి జీపీల్లో సైతం టీ-ఫైబర్ సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పరికరాలు బిగించారు... ప్రారంభం మరిచారు..

మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీల్లో అవసరమైన టీ-ఫైబర్ కేబుల్, పరికరాలను బిగించారు. విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ పలకలు, ఇన్వర్టర్ బ్యాటరీలు అమర్చారు. సాంకేతిక సిబ్బంది పంచాయతీలకు వచ్చి టెస్టింగ్ చేశారు. అన్నీ బాగానే ఉన్నా ఇప్పటి వరకు సేవలు ప్రారంభించకపోవడంతో గ్రామ పంచాయతీల్లో టీ-ఫైబర్ పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేక ఈ-పాలన మరుగు పడింది. దీంతో గ్రామాల్లోనే డిజిటల్ సేవలు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంచాయతీల్లో జాడలేని ఈ-పాలన..

మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీల్లో సుమారు 74 మంది ఈ-పంచాయతీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపు, ఆదాయం, వ్యయాలు, జీతభత్యాలు, జనన, మరణ ధృవపత్రాల జారీ, ఇంటి పన్ను తదితర సేవలను ప్రజలకు డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకు రావాలన్నది ప్రధాన ఉద్దేశం. గ్రామ పంచాయతీ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతో పాటు డిజిటల్ సేవలు అందించాలని గతంలో క్లస్టర్ల వారీగా ఈ-పంచాయతీ ఆపరేటర్లను నియమించారు. వారికి కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులోకి రాకపోవడంతో ఈ-పాలన జాడ లేకుండా పోయింది. చాలా మంది ఈ-పంచాయతీ ఆపరేటర్లు మండల పరిషత్ కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రజలు పన్నులు, ఇతర రుసుములు చెల్లిస్తున్నా, వారికి పంచాయతీ కార్యదర్శులు పాత విధానంలోనే రసీదులు అందజేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా టీ-ఫైబర్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తే గ్రామాల్లోనే ప్రజలకు డిజిటల్ సేవలు అందే అవకాశం ఉంటుంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

మెదక్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో టీ-ఫైబర్‌కు సంబంధించిన పరికరాలు బిగించారు. కరెంటు కనెక్షన్ సైతం ఇచ్చారు. వాటి నుంచి మాత్రం గ్రామ పంచాయతీలకు ఎలాంటి సేవలు అందడం లేదు. టీ-ఫైబర్ సేవలు అందుబాటులోకి వస్తే పనులు గ్రామీణులకు ఆన్‌లైన్ సేవలు సులభతరం అవుతాయి. గ్రామీణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాం.

– యాదయ్య, డీపీవో మెదక్

విద్యుత్ సమస్య పరిష్కరిస్తాం

- విద్యుత్ అధికారులు

అక్కన్నపేటలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతిరెడ్డి

రామాయంపేట, మార్చి 6: భూగర్భ జలాలు అడుగంటి బోరు మోటర్లపై ఒత్తిడి పడి కాలిపోతున్నాయని, రైతులకు విద్యుత్ సమస్యలు పరిష్కరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని రామాయంపేట విద్యుత్ ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. 'అస్తవ్యస్త కరెంట్‌తో కాలిపోతున్న మోటర్లు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి గ్రామాల బాట పట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. విద్యుత్ సమస్యల పరిష్కరానికి, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు సిబ్బందితో పనులు చేయిస్తున్నామని తెలిపారు. మండల వ్యాప్తంగా ఎక్కడా విద్యుత్ సమస్య లేకుండా చేస్తామన్నారు. వారం రోజులుగా గ్రామాలను సిబ్బంది సందర్శిస్తున్నారని, ప్రతి గ్రామంలో వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేస్తున్నామని తెలిపారు. అక్కన్నపేటలోని పొలాలను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.

అస్తవ్యస్త కరెంట్‌తో కాలిపోతున్న మోటర్లు

ఐఐటీహెచ్‌లో సైన్స్ కమ్యూనికేషన్‌పై వర్క్‌షాప్

కంది, మార్చి 6: సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఇండియన్ నేషనల్ యంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్ న్యూఢిల్లీ సహకారంతో సైన్స్ కమ్యూనికేషన్‌పై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద ఈ వర్క్‌షాప్ జరగనుంది. ఈ వర్క్‌షాప్‌ను ఐఐటీ హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, నేషనల్ యంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్ సభ్యులు డాక్టర్ శ్రీపర్ణ చటర్జీ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11 మంది నిపుణులైన రిసోర్స్ పర్సన్‌లతో శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సమర్థవంతమైన సైన్స్ కమ్యూనికేషన్ ద్వారా పరిశోధనలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల్లో స్వతంత్ర పరిశోధనా ఆలోచనలు తీసుకొచ్చేందుకు ప్రొఫెసర్లు కృషి చేయాలని సూచించారు. యువ పరిశోధకులు ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

డంపుయార్డును విరమించుకోవాలి

- కొనసాగిన దీక్షలు.. ప్రభుత్వానికి డిమాండ్

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వీరభద్ర హమాలీ సంఘం సభ్యులకు మద్దతు పలుకుతున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మార్చి 6: ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు పనులు వెంటనే ఆపాలని రైతు జేఏసీ నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 30వ రోజుకు చేరుకున్నాయి. గుమ్మిడిదల, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. గుమ్మడిదల బల్దియాలో వీరభద్ర హమాలీ సంఘం సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు మూడు చింతల నరేందర్‌రెడ్డి, పుట్ట నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. 30 రోజులుగా డంపింగ్‌యార్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయం అన్నారు. ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు ఏర్పాటుతో ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని కోరారు. నల్లవల్లిలో రైతు మహిళా సంఘం సభ్యులు మాట్లాడారు. 30 రోజులుగా చేస్తున్న దీక్షలకు సర్కారు స్పందించి డంపుయార్డు పనులు వెంటనే ఆపాలన్నారు. దీక్షలో జేఏసీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మంద బలరాంరెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, ముద్దంగుల గోపాల్, రామకృష్ణ, కొరివి సురేశ్, రాజుగౌడ్, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


నల్లవల్లిలో రిలే నిరాహార దీక్షలో రైతు మహిళా సంఘాల సభ్యులు

కొత్తపల్లిలో రిలే నిరాహార దీక్షలో గ్రామస్తులు